ప్రజాశక్తి

బుధవారం 21 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

తాగునీటికి కటకట తప్పదా?

- పులిచింతలలో గణనీయంగా తగ్గిన నీటి నిల్వ
- గరిష్ట నీటి నిల్వ 45.77 టీఎంసీలు
- ప్రస్తుతంనీటినిల్వ 5.72 టీఎంసీలు
- సాగర్‌లో 144 టీఎంసీలకు పడిపోయిన నిల్వ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడుజిల్లాలో తాగునీటి సమస్య పొంచి ఉంది. ప్రధానంగా నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, గత కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడం, భూగర్భజలాల నిల్వలు తగ్గిపోవడంతో నీటి ఎద్దడి తప్పేలా లేదు. గత వారంరోజుల నుంచి ఎండల తీవ్రత పెరుగుతోంది. ఈఏడాది జులై నుంచి ఇప్పటి వరకు ఎగువ నుంచి వరద ప్రవాహం రాకపోవడం వల్ల ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయి. పులిచింతల జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా మంగళవారం సాయంత్రం 5.71 టిఎంసిలకు పడిపోయింది.చాలా కాలంగా వర్షాలు లేకపోవడం, కాల్వలో నీటి ప్రవాహం లేకపోవడం, జలాశయంలోకి కొత్తనీరు రాకపోవడం వల్ల పులిచింతల నుంచి వస్తున్న నీరు కూడా కలుషితంగా వస్తున్నట్టు మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. ఇందువల్ల విజయవాడ, ఏలూరు,గుంటూరు కార్పొరేషన్లకు, పలు గ్రామాలకు ఫిల్టరేషన్ సమస్యలు ఏర్పడుతున్నాయని అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో దాదాపు 28 టిఎంసీల నీటి నిల్వ ఉంది. ఈఏడాది నీటి నిల్వ గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం తాగునీటికే కటకటలాడే పరిస్థితి ఉందని, అందువల్ల ప్రస్తుతం వివిధ దశలో ఉన్న రబీ పంటలు మొక్కజొన్న, జొన్న సాగుకు నీరు ఇవ్వలేమంటున్నారు. నాగార్జున సాగర్‌లో కూడా నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. సాగర్‌లో గరిష్ట నీటి నిల్వ 312 టిఎంసీలు కూడా ప్రస్తుతం 144 టిఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద కూడా కనీసం 3.20 టిఎంసీల నీటి నిల్వ ఉండాల్సి ఉండగా మంగళవారం సాయంత్రం 2.71 టిఎంసీల నిల్వ మాత్రమే ఉంది. ఈనెలాఖరు కల్లా సాగర్ జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేగాక ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మిర్చికి ఇంకా కనీసం ఒక తడికి నీరు అవసరం ఉంది. ప్రస్తుతం సాగర్ నుంచి నీరు విడుదల చేసేపరిస్థితి లేదని అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టుపరిధిలో పల్నాడుజిల్లాతోపాటు గుంటూరు జిల్లాలో తాడికొండ, పత్తిపాడు నియోజకవర్గాల్లోని దాదాపు 200 గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతిఏటా మేనెలలో నీటిఎద్దడి వస్తుందని, కానీ ఈ ఏడాది మార్చిచివరికే ఈ సమస్య రావచ్చునంటున్నారు. ప్రధానంగా భూగర్భజలాలు తగ్గిపోవడం వల్ల కూడా సమస్య తీవ్రత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాల్వచివరి భూములకు నీరుచేరడం కూడాకష్టతరంగా మారింది. ఇందువల్ల చివరి ప్రాంతాలలో చెరువులను నింపడంకూడా కష్టతరంగా మారనుంది. మార్చిలో సాగర్ నుంచి ఐదు టిఎంసీలు తాగునీటి అవసరాలకువిడుదల చేసే అవకాశంఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే తెలంగాణతో కలిపి కెఆర్ఎంబి అనుమతితో కేటాయింపులు ఉంటాయని అధికారులు తెలిపారు.

ఏడాదిలోగా మాతాశిశు సంరక్షణ కేంద్రం పూర్తి

ఎంసిహెచ్ నిర్మాణ పనుల పరిశీలించిన జింకానా బృందం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని జింఖానా ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసిహెచ్) నిర్మాణ పనులను జింకాన బోర్డు బృందం మంగళవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఎంసిహెచ్‌ను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని అడిగి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించింది. తొలుత బృందం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి పనులపై సమీక్షించింది. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఎంసిహెచ్ నిర్మాణం గొప్పదని, ఇలాంటి ఆసుపత్రి సౌత్ ఇండియాలోనే ఉండదని అన్నారు. ఇప్పటికే ఆరు ఫ్లోర్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జింకాన బోర్డు సభ్యులు పొదిల ప్రసాద్ మాట్లాడుతూ ఎంజిహెచ్ పేదలకు ఎంతో అండగా ఉండబోతుందని అన్నారు. డాక్టర్ ఉమా గవిని రూ.22 కోట్లు ఇచ్చారని, మిగతా జింకాన సభ్యులు మరో రూ.80 కోట్లను అందచేస్తున్నారని తెలిపారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. పొదిల ప్రసాద్ బ్లాక్‌లో రూ.రెండు కోట్లతో రెండంతస్తుల భవనాన్ని పూర్తి చేయనున్నట్లు చెప్పారు. జింకాన బోర్డు చైర్ పర్సన్ డాక్టర్ గంగ లక్ష్మి మాట్లాడుతూ రోగుల కష్టాలను చూసి తట్టుకోలేక ఎంసిహెచ్ నిర్మాణానికి పూనుకున్నామని చెప్పారు. తమ కుటుంబ సభ్యుల సహకారంతో రూ.3.5 కోట్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జింఖానా కార్యనిర్వాహక సభ్యులు నాగభైరవ లాల్‌బహదూర్ శ్రీనివాస్, నాగభైరవ విజయలక్ష్మి, గంగా చౌదరి, జింకనా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కరరావు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌కు నిధులు మంజూరు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ 5లో

కుటుంబ సభ్యుల ఒత్తిడితోనే వైసిపిలోకి ఆర్‌కె

అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం దక్కేనా?

వార్త మెయిన్‌లో

విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ ప్రారంభం

'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ 8 లో

తాగునీరు వృథాగా నేలపాలు

పగిలిపోయిన ప్రధాన నీటి పైప్‌లైన్ 5 లో

నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం

- ఎపిజెఎసి ఆధ్వర్యంలో ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను నిర్లక్ష్యం చేస్తే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఎపి జెఎసి నేతలు హెచ్చరించారు. 12 పిఆర్‌సి అమలు చేసే వరకూ 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ త్వరితగతిన పూర్తి చేయాలని తదితర డిమాండ్లతో ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తొలుత స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీలో ఉద్యోగులు, 2లో

ఐక్యతా అభివాదం చేస్తున్న నాయకులు.. ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



యుద్ధానికి వాలంటీర్లు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వాలంటీర్లకు పురస్కారాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వద్ద మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరో రెండు నెలల పాటు పేదల భవిష్యత్తు మార్చేందుకు మనమందరం చేస్తున్న యుద్ధానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. భావి లీడర్లుగా వాలంటీర్లను సిఎం భావిస్తున్నారని, ఆ దిశగా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని చెప్పారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ పర్వం కొనసాగగా జగనన్న పరిపాలనలో వాలంటీర్ల ద్వారా సామాజిక సేవ ఔదార్యం కొనసాగిందన్నారు. కరోనా సమయములోనూ, వృద్ధులకు, వికలాంగులకు ఒకటో తేదీనే పింఛను అందించడంలో వాలంటీర్లు చేసిన కృషి స్ఫూర్తివంతమైందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో 294 మందికి రూ.45 లక్షలు అందించారు. పురస్కారాలను ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున సేవామిత్ర అవార్డులు అందించగా సేవరత్న పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున ఐదుగురికి, సేవావజ్ర కింద ఒక్కొక్కరికి రూ.45 వేల చొప్పున ఇద్దరికి పురస్కారాలు ప్రదానం చేశారు.

సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : చేబ్రోలు లో అక్రమంగా అనుమతులు లేని/ నిషేదించబడిన సిగరెట్లను విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్సు ఎన్ఫోర్సు మెంట్ అధికారులు స్థానిక రెవెన్యూ పోలీసు అధికారులతో కలసి చేబ్రోలు లోని వేంకటేశ్వర రావు కిరాణా షాప్ లో తనిఖీ చేయగా యజమాని వూర వేంకటేశ్వర రావు అనుమతులు లేని నిషేదించబడిన ఆరోగ్యమునకు హానికరమైన వివిధ బ్రాండ్ల సిగరెట్లను అమ్ముతున్నట్లు గుర్తించారు. ప్యారిస్ సిగరెట్లు 180 ప్యాకెట్స్,గోల్డ్ విమల్ సిగరెట్లు 620 ప్యాకెట్స్, గోల్డ్ విమల్ ప్రీమియం సిగరెట్లు 470 ప్యాకెట్స్, మిడ్లాండ్ సిగరెట్లు 20 ప్యాకెట్స్ మొత్తం విలువ రూ. లక్షా 14వేలుగా గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని షాపు యజమానిపై కేసు నమోదుచేసినట్టు విజిలెన్సు అధికారులు తెలిపారు. సిఐ ఎ.శ్రీహరి, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'క్రైస్తవులను మోసం చేసిన జగన్'

ప్రజాశక్తి - చేబ్రోలు : రాష్టంలో 25 శాతం క్రైస్తవులకు రాజ్యసభ ఎంపీ స్థానాల్లో వైస్ జగన్ మోహన్‌రెడ్డి మొండిచేయి చూపారని ఆంధ్రప్రదేశ్ జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ (జెబిసిఎ) ఛైర్మన్ అయిన డాక్టర్ జోసఫ్ మోసిగంటి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. జగన్‌ను నమ్మి క్రైస్తవులు 98 శాతం మంది ఓట్లేశారని, కనీసం నామినేటెడ్ పోస్టులైనా ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్టంలో సుమారు 80 వేల మంది పాస్టర్లుంటే వీరిలో ఏడాది నుండి మొదటి విడతగా 5196 మందికి, రెండో విడతగా 3321 మందికే రూ.5 వేల సాయం అందిందని తెలిపారు. క్రైస్తవులపై దాడులు పెరిగాయని పేర్కొన్నారు. ఇప్పుడు వైఎస్ విమలారెడ్డిని ఓట్ల కోసం పంపుతున్నారని, అయితే ఆమెను గతంలో క్రైస్తవుల సమస్యలపై సంప్రదించగా రాజకీయాల్లో జోక్యం చేసుకోనని చెప్పారని తెలిపారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు.

గెలిస్తే ఇక్కడే ఇల్లు కట్టుకుంటా : అనిల్‌కుమార్

- అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వరికపూడిశెల పూర్తి
- శ్రీకృష్ణదేవరాయలను ఢిల్లీకి పంపిస్తే గల్లికే పరిమితమయ్యారు
- ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

బహిరంగ సభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్

ప్రజాశక్తి - వినుకొండ

సిఎం జగన్ మోహన్‌రెడ్డిపైకి కట్టకట్టుకుని వస్తున్న వారికి జనం తగిన విధంగా బుద్ధి చెప్పాలని వైసిపి నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పుట్టినరోజు సందర్భంగా స్థానిక పల్నాడు రోడ్డులో రాష్ట్ర రహదారిపై మంగళవారం బహిరంగ సభ నిర్వహించారు. తొలుత వినుకొండ మండలం విఠంరాజుపల్లి నుండి వైసిపి శ్రేణులతో భారీ ర్యాలీగా సభ వద్దకు చేరుకున్నారు. అనంతరం సభలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో నరసరావుపేట నుంచి నెల్లూరుకు చెందిన నేదురుపల్లి జనార్దన్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఎంపీలుగా ఎన్నుకుని పల్నాడు ప్రజలు ఆశీర్వదించారని, తననూ అదేవిధంగా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీగా గెలిచిన వెంటనే పార్లమెంట్ పరిధిలో సొంత ఇల్లు నిర్మించుకొని ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిమ్ మైనార్టీలకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, వైసిపి ప్రభుత్వం మాత్రం పెద్దపీట వేసిందని అన్నారు. నరసరావుపేట పార్లమెంటు నుంచి తొలిసారి బీసీలకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని ప్రజల స్వాగతించి ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గతంలో తాను 40 వేల ఓట్ల మెజార్టీతో గెలిచానని, ఈ సారి 60 వేల మోట్ల మెజార్టీతో గెలుస్తానని అన్నారు. వరికపూడిశల ప్రాజెక్ట్ అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పూర్తవుతుందని చెప్పారు. నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలను గెలిపించి ఢిల్లీకి పంపితే ఆయన గల్లీకే పరిమితమయ్యాడని ఎద్దేవ చేశారు. ఐదేళ్లలో వినుకొండ నియోజకవర్గం కేవలం రూ.60 లక్షల మాత్రమే నిధులు ఇచ్చారని అన్నారు. అనంతరం మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని అనిల్ కుమార్ ఆవిష్కరించారు.

నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు, పెన్షనర్లు వందల మంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట జెఎసి జిల్లా ఛైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగ సంఘాలతో సానుకూల ధోరణితో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు దాచుకున్న ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులు, జిపిఎఫ్ నిధులు ఇతర బకాయిలు అన్నీ కలిపి దాదాపు రూ.21500 కోట్లు ఉద్యోగులకు చెల్లించకుండా దారిమళ్లించి, ఉద్యోగులను రోడ్డుపైకి తీసుకొచ్చిందన్నారు. మూడేళ్ల నుండి సరెండర్ లీవులు పెండింగ్‌లో ఉన్నాయని, పిల్లల పెళ్లిళ్లు ఇతర అవసరాల కోసం దాచుకున్న డబ్బులు కూడా ఇవ్వలేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే 2022లో బిఆర్‌టిఎస్ రోడ్డును జరిగిన ఆందోళనను తలపించేలా ఈనెల 27న చలో విజయవాడ ని ం్ వి ా స్తా వ ు ని హెచ్చరించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది ఓటర్లు ఉద్యోగుల కుటుంబాల్లో ఉన్నారని, ప్రభుత్వాల గెలుపోటములు నిర్ణయిస్తారని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వద్ద ప్రజాస్వామ్య ధోరణి లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాలు, విద్యావేత్తలు, మేధావుల సలహాలు స్వీకరించే పరిస్థితి లేదన్నారు. కనీసం సమస్యలపై నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందన్నారు.

ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు, పెన్షనర్లు

కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్.నాగూర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి, ఎపిజెఎసి జిల్లా కన్వీనర్ ఎస్.సతీష్‌కుమార్, ఎపిటిఎఫ్ నాయకులు బసవలింగారావు, వేళాంగిణిరాజు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కె.నరసింహారెడ్డి, సేవా నాయక, రాధారాణి పాల్గొన్నారు.

రెండోరోజుకు కెఎల్‌యు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

క్రీడలను ప్రోత్సహించడంలో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ముందుంటుందని క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ అన్నారు. వర్సిటీలో జాతీయస్థాయిలో జరుగుతున్న కోనేరు లక్ష్మయ్య మెమోరియల్ ట్రోఫీ 2024 సందర్భంగా మంగళవారం ఆయా క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీని 15 ఏళ్ల నుండి ప్రతీ ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19 నుండి 21 వరకు జరుగుతున్న క్రీడల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళల రాష్ట్రాల నుండి సుమారు 480 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని అన్నారు. ఇదిలా ఉండగా పోటీల్లో భాగంగా రెండోరోజు ఖోఖో మహిళల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన జిఎన్ఐటిఎస్ విద్యా సంస్థ విద్యార్థులు పి.ధరణి జట్టు ప్రథమ స్థానం సాధించగా, విజ్ఞాన్ యూనివర్సిటీ వడ్లమూడి విద్యార్థులు కె.శ్యామ సుఖన్య జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. బాడ్మింటన్ పురుషుల విభాగంలో కెఎల్ హెచ్ హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థి సిహెచ్.వినయ్ ప్రథమ స్థానం సాధించగా కెఎల్‌యు వడ్డేశ్వరం గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్ విద్యార్థి పూజిత్ రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సిహెచ్.హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, ఆర్.సుబాకర్‌రాజు, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖోఖోలో విజేతగా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన జిఎన్ఐటిఎస్ విద్యా సంస్థ జట్టు

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి : సుచరిత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రతి విద్యార్థి హక్కులతో పాటుగా బాధ్యతల గురించి కూడా తెలుసుకుని మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. మంగళవారం పారా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మానవ హక్కుల క్లబ్ విద్యార్థులతో మాట్లాడారు. "పారా" స్వచ్ఛంద సేవా సంస్థ ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో బాలల క్లబ్‌ల ద్వారా నిర్వహిస్తున్న మానవ హక్కుల విద్యా బోధన అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, బాల్య వివాహాలు, బాల కార్మికులు, బడి మానేసిన బాలలు, బాలల అక్రమ రవాణా, బాలలపై వేధింపులు తదితర సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలోని పాఠశాలలో ద్వారా అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. అనంతరం ఐదు అంశాలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. నాణ్యమైన విద్యను అందరికీ అందించాలని, నెలలో ఒక రోజు బాలల కోసం ప్రత్యేకమైన గ్రీవెన్స్ రోజుని ఏర్పాటు చేయాలని, మానవ హక్కుల విద్యా బోధనను పాఠ్య ప్రణాళికలో ఒక పాఠ్యాంశంగా చేర్చాలని, వికలాగుల కోసం ప్రత్యేక సదుపాయాలు ప్రతి పాఠశాలలో ఏర్పాటుచేయాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సమర్ధవంతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పారా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ టి.మంగయ్య, యనమదల పాఠశాల ఎపిజె అబ్దుల్ కలాం మానవ హక్కుల క్లబ్, అంబేద్కర్ మానవహక్కుల క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి ఆటోనగర్ వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు

ఆటోనగర్-నందివెలుగు మార్గంలో చేపట్టిన మరమ్మతులు

ఎట్టకేటలకు ప్యాచ్ వర్కులు ప్రారంభం

- రోడ్లు వేయటానికే ఎమ్మెల్యే కావాల్సిన అవసరం లేదు
- అంతకు మించి కోట్లలో సంక్షేమం అందించామన్న ఎమ్మెల్యే
- చర్చనీయాంశమైన ఎమ్మెల్యే వ్యాఖ్యలు

ప్రజాశక్తి-తెనాలి

ఐదేళ్ళపాటు నిద్రమత్తులో ఉన్న ప్రభుత్వానికి ఎట్టకేలకు ఎన్నికల వేళ మెళుకువ వచ్చింది. ఇన్నాళ్లు ప్రజలు ఎంత మొత్తుకున్నా రోడ్లకు కనీసం మరమ్మతులు చేయటానికి కూడా సాహసించలేదు. నిధులు మంజూరైనా గతంలో చేసిన పనులకే బిల్లులు రాక కాంట్రాక్టర్లూ ముందుకు రాలేదు. రోడ్లు సరిలేవని, వైసిపి ప్రభుత్వంలో రోడ్లనిర్మాణం చేపట్టలేదని ఇతర పార్టీ నాయకులు, ప్రజలు విమర్శిస్తే 'ఆర్ష్టాల్ రోడ్లు... అంతకంటే ప్రజలకు కోట్లలో సంక్షేమం అందించాం. అది చాలదా..అంటూ స్వయంగా ఎమ్మెల్యే వాఖ్యానించటం ప్రజల్లో చర్చనీయాంశమైది. మరలా ఏమనుకున్నారో తెలియదు కాని ఆటోనగర్ నుంచి నందివెలుగు వరకూ కంటి తుడుపు చర్యగా గుంతలు పూడ్చి మమ అనిపించే పనిలో పడ్డారు.

తెనాలి-విజయవాడ, నందివెలుగు-గుంటూరు, నందివెలుగు-మంగళగిరి రోడ్లు ఎంతో దుర్భరంగా ఉన్నాయి. కనీసం ఒక్క కిలోమీటరు కూడా గుంతలు లేని రోడ్డు లేదంటే అతిశయోక్తి కాదేమో. ఆటోనగర్ వద్ద గుంతల్లో పడి ద్విచక్రవాహన చోదకులు ఎంతో మంది ప్రమాదాల బారిన పడ్డారు. ప్రాణాలూ కోల్పోయారు. నందివెలుగు-గుంటూరు రోడ్డులో అయితే గుంతల్లో పడి అదుపుతప్పి ఇరువురు ద్విచక్ర వాహన చోదకులు ప్రాణాలు కూడా కోల్పోయారు. నందివెలుగు-మంగళగిరి రోడ్డులో ప్రమాదాలకు లెక్కేలేదు. ఇటీవలి కాలంలో కూడా ఆటోనగర్ వద్ద ఓ కారు అదుపుతప్పి తూర్పు కాలువ రీటెయినింగ్ వాల్‌ను ఢీకొని ప్రమాదానికి గురైంది. ఎన్ని ప్రమాదాలు జరిగినా, ఎంత మంది ప్రాణాలు కోల్పోయినా అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూశారు. రోడ్లు బాగుచేయాలంటూ టిడిపి, జనసేన, ప్రజాసంఘాలు పలుమార్లు ఆందోళన చేసినా ఫలితంలేదు. ఇదిలా ఉంటే పెదరావూరు-ఆటోనగర్ నాలుగులైన్ల రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. ముగ్గురు ఎమ్మెల్యేలు మారినా రోడ్డు పూర్తి చేయకపోగా ప్రశ్నించిన వారిపై స్వయంగా ఎమ్మెల్యే వ్యంగ్యాస్త్రాలు సంధించటం ప్రజల్లో తీవ్ర దుమారం రేపింది. ఇటీవల పట్టణంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ఆర్ష్టాల్ ..ఆర్ష్టాల్ రోడ్లు..రోడ్లు వేయటానికి ఎమ్మెల్యే కావాల్సిన అవసరం లేదు. అంతకు మించి ప్రజలకు కోట్లాది రూపాయల సంక్షేమం అందించాం. అది ఎమ్మెల్యే అంటే.. నాలుగులైన్ల రోడ్డుపూర్తి చేయకపోవటానికి కూడా ఓ కారణం ఉంది. అది ఇప్పుడు చెప్పకూడదు.. సమయం వచ్చినపుడు ప్రజలకు చెబుతా' అంటూ వ్యాఖ్యానించటం నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆ పార్టీ నాయకులే అక్కడ రహస్యం ఏముంది? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోతే పనులెలా చేస్తారు? ఆ విషయం బహిరంగంగా చెబితే ఎన్నికల వేళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యానించినట్టవుతుదనేమో' అంటూ వ్యాఖ్యానించటం కొసమెరుపు.

ఇటీవల సోమసుందరపాలెం వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

కంటితుడుపు చర్యగా అతుకులు

ఐదేళ్ళ కాలంలో రోడ్లను పట్టించుకోలేదంటూ బహిరంగ విమర్శలు ఎదురౌతున్న నేపథ్యంలో తూతూ మంత్రంగా అతుకులతో సరిపెట్టే పనిలో పడ్డారు. తెనాలి-విజయవాడ మార్గంలో ఆటోనగర్ నుంచి నందివెలుగు వరకూ ప్యాచ్ వర్కులు ప్రారంభించారు. ఆ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. నిధులు మంజూరైనా కనీసం రోడ్డు వేయించలేకపోయారన్న విమర్శలు వినవస్తున్నాయి.

ప్యాచ్ వర్కులు మాత్రమే చేస్తున్నాం

-నాగేశ్వరరావు, డిఈ, ఆర్అండ్‌బి, తెనాలి

తెనాలి-విజయవాడ మార్గంలో ప్యాచ్ వర్కులు మాత్రమే చేస్తున్నాం. ఆటో నగర్ నుంచి నందివెలుగు వరకూ ప్యాచ్ వర్కు కొనసాగుతోంది. రూ.6లక్షల నిధులతో మెయింటెనెన్స్ కింద పనులు జరుగుతున్నాయి. గతంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో రోడ్లపనులు చేపట్టలేకపోయాం. ప్యాచ్ వర్కుతో ప్రస్తుతానికి ప్రజలకు ఇబ్బంది ఉండదు.

పురుగు మందుల షాపులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - అచ్చంపేట

అక్రమంగా నిలువ ఉంచిన పురుగుమందులను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు ఈ సందర్భంగా గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రమణ కుమార్ విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేట మండలం లోని వెంకట సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్‌లో అక్రమంగా పురుగు మందులు నిల్వ చేశారని విశ్వసనీయ సమాచారంతో గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి కె.ఈశ్వర రావు పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారి తో కలసి వెంకట సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్‌లో తనిఖీ చేయగా, వ్యవసాయ శాఖ వారి నుండి ఎటువంటి అనుమతులు లేకుండా, బిల్లులు లేకుండా వివిధ కంపెనీలకు చెందిన 51 లీటర్ల పురుగు మందులను అక్రమముగా నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. నిల్వ చేయబడిన 51 లీటర్ల పురుగుమందుల విలువ రూ.93,721 విలువ ఉంటుందని, వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.53,390 విలువ గలిగిన 15 లీటర్ల పెస్టిసైడ్స్‌కు ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేనందున వాటి అమ్మకాల నిలుపుదలకు నోటీసులు జారీ చేశారు. కెమికల్ అనాలిసిస్ నిమిత్తం మూడు శాంపిల్స్ తీసుకున్నారు. సబ్ ఇన్స్పెక్టర్ ఎం. రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మరియు విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - నకరికల్లు

భర్త వేధింపులు తాళలేక భార్య బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై పైడి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం చాగల్లు గ్రామానికి చెందిన అంబటి రామకృష్ణకు, 8 సంవత్సరాల క్రితం సంతమాగులూరు మండలం పరిటాల వారి పాలానికి చెందిన వెంకట రాజేశ్వరి (28)కి క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు.. వివాహమైనప్పటినుంచి భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. భర్త రామకృష్ణ, కుటుంబ సభ్యులు రాజేశ్వరిని మానసికంగా , శారీరకంగా, హింసిస్తున్నారని, అత్తారింటి వేధింపులు తట్టుకోలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు రాజేశ్వరి పుట్టింటివారు తెలిపారు. మృతురాలి తండ్రి పుట్టా వీర యోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు మంగళవారం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

అభివృద్ధిని ఓర్వలేక టిడిపి విమర్శలు : ఎమ్మెల్యే రోశయ్య

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని ఓడించడం ఖాయమని పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య జోస్యం చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ పేరును తెలుగు దుష్ప్రచారాల పార్టీగా పేరు మార్చుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక టిడిపి నాయకులు ఆరోపణలు, విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ 650 ఎకరాల భూముల్లో మట్టి గ్రావెల్ తవ్వకాలు చేసి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రజలు అమాయకులు, పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధి గురించి ప్రజలకు బాగా తెలుసు అన్నారు. రోడ్డు అభివృద్ధి విస్తరణకు స్థలాలు, భవనాలు కోల్పో యిన యజమానులకు అణా పైసా ఖర్చు లేకుండా టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. భవన యజమానులను భయభ్రాంతులను చేసి బురద జల్లి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. నీరు చెట్టు కింద మైనింగ్, గ్రావెల్ తవ్వకాలు చేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని విమర్శించారు. ఈనెల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు, దాసరి నారాయణరావు, బొద్దులూరు రంగారావు, ప్రతాప్ కుమార్, పెరికల కృష్ణమోహన్, కోట శ్రీనివాస రావు, రుద్రపాటి ఆదిశేషు, షేక్. సర్దార్ పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 1,50,758
మిర్చి ఎగుమతి	: 1,42,015
మిర్చి నిల్వ	: 1,05,655

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,500 - 20,200
నెం.5	13,500 - 18,000
273	13,000 - 17,000
341	10,,000 - 21,000
4884	14,500 - 18000
సూపర్10	9600 - 18000
	నాన్ ఎసి
తేజ	8,000 - 21,000
బడిగి	10,500 - 20,000
దేవనూరు డీలక్స్	11,000 - 21,000
తాలుకాయలు	5,000 - 12,000

COURT NOTICE
IN THE COURT OF THE III
ADDL.JUNIOR CIVIL.JUDGE::GUNTUR
I.A No: 51 / 2023 and O.S.No: 314/2023

Between:
Bhireddy Salma Reddy
.....Petitioner/ Plaintiff
AND
Bolla Nageswara Rao
...Respondent/ Defendant

To,
Bolla Nageswara Rao ,S/o. Ramaiah,
R/o.Door No.24-17-117, Workers Colony,
Nallacheruvu, Guntur, Guntur JCJC.

పై నెంబరు దావా O.S No: 314/2023లో మరియు సదరు దావాలోని I.A No: 51/2023లో ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు/నోటీసులు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:13-03-2024న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:13-03-2024

వింత రవి సంజీవ రెడ్డి,
వింత చంద్రశేఖర రెడ్డి,
పిటీషనర్/ వాది తరపు అడ్వకేట్స్,
గుంటూరు. సెల్: 7013267626

మహారాజశ్రీ జూనియర్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు : పిడుగురాళ్ల
ఓ.యస్.నెం. 226/2021

బిట్వీన్ :
ఏలూరి ఆనంద్‌కుమార్ .... ప్లెయింటిఫ్
మరియు
ఆలేటి సర్వేశ్వరరావు ... రెస్పాండెంట్

మా క్లైంట్ పైన నెంబర్ ఓ.యస్. నెం. 226/2021 రెస్పాండెంట్ అయినందున మా క్లైంట్ కోర్టు ద్వారా మీకు అనేక మార్లు నోటీసులు పంపించియున్నారు. కాని మీరు కావాలనే కోర్టు నుండి వచ్చిన నోటీసులను తీసుకోవడం లేదు. కనుక కోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసు క్రింద పేపరు పబ్లికేషన్‌కి ఇవ్వమని మీరు నోటీసు తీసుకొని వెంటనే మీరు కాని మీ తరఫు లాయరుగాని అటెండ్ అయి ది. 23-2-2024న మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షమున వాయిదారోజు తీర్మానించగలరు. శ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు వారు

తేది : 20-2-2024
పిడుగురాళ్ళ.

ఇట్లు
పి.మాణిక్యం,
ప్లెయింటిఫ్ అడ్వకేట్,
పిడుగురాళ్ళ. సెల్ : 8106929035

మహారాజశ్రీ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్)
పిడుగురాళ్ల
ఐ.ఎ. నెం. 206/2020 ఓ.యస్.నెం. 59/2020

బిట్వీన్ :
చీటిమిరెడ్డి వెంకటరామిరెడ్డి ... పిటీషనర్ / వాది
మరియు
చిటిమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వగైరాలు
.... రెస్పాండెంట్లు / ప్రతివాదులు

నోటీసు : 3వ ప్రతివాది : ఈద పేరమ్మ భర్త : అంకిరెడ్డి , ఇరికిపల్లి గ్రామం, దాచేపల్లి మండలం, పల్నాడుజిల్లా.

వాది దావా పరిహారములను కోరుతూ మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు వాయిదా ది. 28-03-2024న కలదు. సదరు వాయిదాకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10-30 గం.లకు హాజరయి మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(బై ఆర్డర్ ఆఫ్ కోర్ట్)

వాయిదా : 28-3-2024

డి.చెన్నయ్య, బి.ఎ., బి.ఎల్.,
అడ్వకేట్, పిడుగురాళ్ళ.

పాస్‌పోర్టు పోయినది

పల్నాడుజిల్లా, క్రోసూరు మండలం, పెరికపాడు గ్రామ నివాసి ఉప్పు కార్తీక్ S/o నాగేశ్వరరావు అను నా యొక్క లగేజి బ్యాగ్ పోయినది. అందులో నా **Passport No.: Y8220769** వున్నది. ది.25-1-2024న రాత్రి 7-30 గం.లకు పిడుగురాళ్ళ నుంచి క్రోసూరు వెళుతున్న ఆర్టీసీ బస్‌లో మరిచిపోవడం జరిగింది. ఎంత వెదికినా దొరకలేదు. ఎవరికైన దొరికిన యెడల నా ఫోన్ నెంబర్ : 9346452026కు తెలియజేయగలరు.

ఇట్లు
ఉప్పుకార్తీక్ S/oనాగేశ్వరరావు,
పెరికపాడు గ్రామం, క్రోసూరు మండలం.
పల్నాడుజిల్లా. సెల్ : 9346452026

అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి డీఆర్వో అజయ్ కుమార్

127 సెంటర్లలో పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వచ్చే నెల 18వ తేదీ నుండి జరిగే 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా, నిర్వహించాలని అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి అజయ్ కుమార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై నరసరావుపేటలోని డిఆర్‌ఓ చాంబర్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షించారు. పరీక్షలు 127 సెంటర్లలో నిర్వహిస్తుండగా 29244 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని, విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలని, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రశ్నాపత్రాలను ఆన్సర్ షీట్లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములను పటిష్ఠంగా ఉంచాలన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయమణి

పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయుల్లేరు

ప్రజాశక్తి - నకరికల్లు

శివాపురం తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సరిపడా లేరని స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పారు. మండల కేంద్రమైన నకరికల్లులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఎం.అనురాధ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు మార్చేటప్పుడు పంచాయతీ లైట్లను విద్యుత్ సిబ్బంది ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని, లైట్లు పాడవుతున్నాయని చెప్పారు. కొన్ని సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు అందుబాటులో ఉండడం లేదని అన్నారు. గుండ్లపల్లిలో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్నారు. విద్యుత్ ఎఇ నాగసురేష్‌బాబు మాట్లాడుతూ నరసింగపాడులో స్థలం అందుబాటులో ఉంటే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జయమణి, ఈవోపీఆర్‌డి గిరిధర్, వైఎస్ ఎంపిపి ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, హుస్సేన్ బి బాష, డాక్టర్ పూజ పాల్గొన్నారు.

రోజుకు 2 వేల పనిదినాలు కల్పించాలి

ప్రజాశక్తి - నకరికల్లు

ఉపాధి హామీలో 100 రోజుల పని దినాలకు దగ్గరగా ఉన్న కుటుంబాలు వాటిని పూర్తి చేసేలా చూడాలని సత్తెనపల్లి ఏపీడీ వెంకట నారాయణ అన్నారు. పనిదినాలపై ఫీల్డ్ అసిస్టెంట్లతో స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. మండల పరిధిలో 261 కుటుంబాలు వందరోజుల ఉపాధి హామీ పని దినాలకు చేరువలో ఉన్నాయని, వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. ప్రతిరోజు 2000 పని దినాలను కల్పించాలన్నారు. సమీక్షలో ఏపీఓ సుందర్‌రావు, టిఎ గోపీకృష్ణ, అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లబ్ధిదార్లకు మెగా చెక్కును అందిస్తున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్ తదితరులు

321 మందికి రూ.2.45 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదితోఫా 5వ విడత జమను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుండి మంగళవారం ప్రారంభించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి కార్యక్రమంలో ట్రైనీకలెక్టర్ కల్పశ్రీ, లబ్ధిదార్లు పాల్గొన్నారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా 321 మంది లబ్ధిదారులకు రూ.2.45 కోట్లు జమైనట్లు చెప్పారు. వీరిలో ఎస్సీలకు సంబంధించి 112 మందికి రూ.1.12 కోట్లు, (ఎస్సీల్లో కులాంతర వివాహం చేసుకున్న ఒకరికి రూ.1.20 లక్షలు), వికలాంగులు ఐదుగురికి రూ.7.50 లక్షలు, ఎస్టీలు 22 మందికి రూ.22 లక్షలు, (కులాంతర వివాహం చేసుకొన్న 8 మందికి రూ.9.60 లక్షలు), బీసీలు 159 మందికి రూ.79.50 లక్షలు, (కులాంతర వివాహం చేసుకొన్న ఐదుగురికి రూ.3.75 లక్షలు), మైనారిటీకి సంబంధించి 9 మందికి రూ.9 లక్షలు జమ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదార్లకు మెగా చెక్కును అందించారు.బ కార్యక్రమములో డిఆర్‌డిఎ పీడీ బాలూనాయక్, ఇన్‌ఛార్జి సాంఘిక సంక్షేమాధికారి వరలక్ష్మి, వెనకబడిన తరగతుల సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల, బాలికల కబడ్డీ పోటీలు స్థానిక ప్రగతి పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నుండి 23వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం సందర్శించారు. కబడ్డీ పోటీలకు ఏర్పాటు చేసిన ఆటస్థలాన్ని, క్రీడాకారులకు వసతి ఏర్పాట్లను పరిశీంచారు. ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడల్లో అసౌకర్యాలేమీ లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. క్రీడాకారులతో పట్టణంలో ప్రదర్శనకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి రాంబాబు

మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

అబ్బురపరచి ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న జీవాలయం లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ముగిసింది. ప్రదర్శనను పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు సందర్శించారు. మండల విద్యాశాఖాధికారి జప్రుల్లా మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంచడంలో, నిత్యజీవితములో సైన్స్ ఉపయోగాలు, చారిత్రాత్మక విషయాలు తెలుసుకోవడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని చెప్పారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని వైజ్ఞానిక ప్రదర్శనలు పెంచుతాయన్నారు. విద్యార్థులు రూపొందించిన పలు విజ్ఞాన అంశాలు, చారిత్రక కట్టడాల నమూనాలు, మురికి నీరు నుండి పరిశుభ్రమైన నీరు ఎలా పొందవచ్చో చూపించిన ప్రయోగాలతో పాటు వినుకొండ పట్టణ నమూనా, జంతు ప్రదర్శనశాలలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మార్నేని బాల సౌరయ్య, వైస్ ప్రిన్సిపల్ టి.వీర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడిపై జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - వినుకొండ

అనంతపురం జిల్లా రాప్తాడులో సిఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక శివయ్య స్తూపం వద్ద నుండి తహశీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని, ప్రతిరోజు ఎక్కడో చోట విలేఖరులపై దాడి పరిపాటైందని ఆవేదన వెలిబుచ్చారు. దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వై.బుజ్జి, ఎల్.వెంకట్రావు, ఎస్.కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

విలేకర్లపై దాడిని నిరసిస్తూ మండల కేంద్రమైన అమరావతిలో మండల జర్నలిస్టుల అసోసియేషన ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. తొలుత స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. తహశీల్దార్, పోలీస్‌స్టేషన్‌కు ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రాలిచ్చారు. ప్రజాసేవలో అలుపెరుగకుండా పని చేస్తున్న విలేకర్లపై దాడులు దారుణమన్నారు. ఇందుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. వీరికి పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి ప్రదర్శనలో పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం పల్నాడు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు 08647-252999 నంబర్ ద్వారా సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కేంద్రీయ విద్యాలయ నూతన భవన సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామ పంచాయతీ పరిధి రామకష్ణాపురంలో సుమారు 10 ఎకరాల్లో రూ.24.80 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా సత్తెనపల్లితోపాటు 25 కేంద్రీయ విద్యాలయ నూతన భవనాలను ప్రారంభించారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నల్లపాడు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ హనీమెహతా, సత్తెనపల్లి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

36 మంది వాగ్దేవి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో చెన్నైకి చెందిన టాటా కనెక్ట్ మల్టీనేషనల్ కంపెనీ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా తమ కళాశాలకు చెందిన 36 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉద్యోగాలు పొందినవారు రూ.2.60 లక్షల వార్షిక వేతనం పొందుతారని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను మొదటి సంవత్సరం నుండే తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కె.కోటేశ్వరరావు, ఒ.నాగేశ్వరరావు, ఎస్.సురేష్ బాబు, పి.కృష్ణారావు, ఐ.కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
బుధవారం 21 ఫిబ్రవరి 2024

తాగునీరు వృధాగా నేలపాలు

పగిలిపోయిన ప్రధాన నీటి పైప్‌లైన్

ప్రజాశక్తి - తెనాలి

కృష్ణా జలాలను పట్ట ణానికి తాగునీటి నిమిత్తం తరలించే ప్రధాన పైప్‌లైన్ పగిలిపోయింది. ఫలితంగా పెద్ద ఎత్తున తాగునీరు వృధా అవుతుంది. దాదాపు రూ. 100 కోట్లకు పైగా నిధులను వెచ్చించి పైప్ లైన్ ద్వారా కృష్ణా జలాలను తెనాలి పట్టణానికి తరలించారు. తెనాలి విజయవాడ ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న పైప్ లైన్ వియస్సార్ కళాశాల దాటిన తరువాత పగిలిపోయింది. మంగళవారం ఉదయం ఆ ప్రాంతంలో జెసిబి సాయంతో కొందరు వ్యక్తులు వ్యర్థాలను తొలగించే ప్రయత్నం చేశారని, దానిలో భాగంగానే పైప్ లైన్ పగిలిపోవడంతో చల్లగా వారు అక్కడి నుంచి ఉడాయించారని స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి వివిఎస్సార్ కళాశాల ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ నుంచి గల ఫుట్ పాత్ పై తెనాలి బండ్ పేరుతో ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. ఈ నేపద్యంలో ఫుట్‌పాత్ పై పండ్లు, కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులను చాలామందిని కాళీ చేయించారు. ఈ నేపథ్యంలో వ్యాపారం కోసం తాజాగా స్థావరం ఏర్పాటు చేసుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు జెసిబితో చెత్తాచెదారాన్ని తొలగించే

ప్రయత్నం చేయటంతో ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఘటన జరిగినప్పటికీ సాయంత్రం వరకూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైప్ లైన్ పగిలిన ప్రాంతంలో వ్యర్థాలతోపాటు జంతు కళేబరాలను కూడా వేస్తుంటారు. దీంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంటూరు ఛానల్‌కు నిధులు మంజూరు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించడానికి వెంటనే నిధులు కేటాయించి, పనులు పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఈ ప్రాంత ప్రజలు గుంటూరు ఛానల్ పొడిగింపు కొరకు పోరాడుతున్నారని, ఈ ఛానల్ పొడిగింపు వల్ల 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు లభిస్తుందని తెలిపారు. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల వంటి వాటితో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాంత ప్రజలు తాగునీరు, వాడుక నీరు సరిగ్గా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని, గుంటూరు ఛానల్ ను పొడిగిస్తే ఈ ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు. ప్రభుత్వాలు కేవలం హామీలకే పరిమితమయ్యాయని, రైతులు ఆందోళనలు చేపట్టినప్పుడు పొడిగిస్తామని, నిధులు కేటాయిస్తామని హామీ ఇస్తుంది కానీ, అమలులోకి రావడం లేదని వాపోయారు, వెంటనే ప్రభుత్వం గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని, లేని పక్షంలో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ఆందోళనలు తీవ్రతరం చేపడుతామని తెలిపారు. ఈ సమావేశంలో గుంటూరు ఛానల్ పోరాట కమిటీ కన్వీనర్ నరిశెట్టి ఆచారి, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, చుక్కా యానాదులు, కాపు వెంకట సుబ్బారావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో 303 మందికి షాదీతోఫా, కళ్యాణమస్తు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఐదవ విడతలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకంలో 303 మంది నూతన వధువరుల జంటలకు రూ.2,75,40,000లు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదవ విడత కళ్యాణమస్తు, షాదీతోఫా నిధులను వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆన్లైన్‌లో విడుదల చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్‌పర్సన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయకార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కష్ణ బలిజ, పూసల కార్పోరేషన్ ఛైర్‌పర్సన్ కోలా భవానీ మణికంఠతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మెగాచెక్కును

మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, మేయర్ తదితరులు

అందజేశారు. ఈ డిఆర్‌డిఎ పీడీ హరిహరనాధ్, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసుధనరావు, ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ డైరక్టర్ కొత్త చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అంగన్‌వాడీల నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి-గుంటూరు :అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఒప్పందం మేరకు జీవోలను తక్షణమే జారీ చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం మండల కేంద్రాలలో ప్రదర్శనలు నిర్వహించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు ప్రాజెక్టు, పుల్లడిగుంట సెక్టార్ యూనియన్ సమావేశం 5వ మైలులో విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నేతాజి మాట్లాడుతూ సమ్మె ముగించి ఇప్పటికి నాలుగు వారాలు గడిచినా ప్రభుత్వం సమ్మెకాలం జీతం ఉత్తర్వులు ఇంకా జారీ చేయలేదని అన్నారు. ఒప్పందం మేరకు ఇవ్వాల్సిన ఇతర జీవోలు ఇవ్వడంలోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని అన్నారు ఫిబ్రవరి 22వ తేదీ నాటికి సమ్మె ముగించి నెల రోజులు అవుతున్న సందర్భంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో అంగన్వాడి సెంటర్ల పని పూర్తి అయిన తర్వాత మండలంలోని అంగన్వా డీలు అందరూ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, సెక్టార్ నాయకులు అనురాధ, అంజనాదేవి, దుర్గాభవాని, ఇందిరా పాల్గొన్నారు.

జగనన్న బాటలో నడుస్తాను : ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపుకు తన వంతు కృషి చేస్తానని, వైసిపి అభ్యర్థి చేతిలో నారా లోకేష్ ఓటమి ఖాయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గత రెండు నెలల క్రితం వైఎస్ఆర్ సీపీ కి రాజీనామా చేసిన ఎమ్మెల్యే ఆర్కే మంగళవారం తిరిగి సీఎం జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పేదవాళ్ల జీవితాలు సంతోషంగా ఉండాలని, పేదవాడు గొప్పవాడు కావాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ప్రతి మధ్య తరగతి కుటుంబంలో వెలుగులు నింపడానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాల్లో రెండు నెలల పాటు వైదొలిగిన పరిస్థితి నుంచి తిరిగి జగనన్న బాటలో నడవాలని వైఎస్ఆర్ సీపీ లోకి రావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలో నడుస్తున్న ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో 20-30సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి గా నిలబడగలిగితే పేదల జీవితాలు ఉన్నతస్థితికి చేరుకుంటాయని, ప్రజలం దరూ జగనన్నకు అండగా నిలబడాలన్నారు. వై నాట్ 175లో తాను కూడా భాగస్వామ్యుడిని కావాలని, అదే విధంగా 25 పార్లమెంట్ స్థానాలకు గానూ 25పార్లమెంట్ స్థానాలను వైఎస్ఆర్ సీపీ తిరిగి కైవసం చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. 2014 నుంచి 2024 వరకూ రెండు పర్యాయాలు తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మంగళగిరిలో రానున్న ఎన్నికల్లో ఏ అభ్యర్థిని ఇచ్చినా ఆ అభ్యర్థి విజయానికి పూర్తి స్థాయిలో కృషి చేసి మంగళగిరి నియోజకవర్గంలో మూడవసారి వైఎస్ఆర్ సీపీకి విజయాన్ని అందిస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు చేపట్టిన బలవంతపు భూసేకరణ ను రద్దు చేస్తామన్నారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో అంచనాలు సిద్ధమై ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

బహురూపి నాటికలో సన్నివేశం

సేవా రంగ ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహక బృందం

రెండో రోజుకు వైయస్సార్ కళాపరిషత్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి తెనాలి

వైయస్సార్ నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్యా చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీలలో తొలి ప్రదర్శనగా సద్గురు కళానిలయం గుంటూరు వారి "బహు రూపి" సాంఘిక నాటికను ప్రదర్శించారు. శిష్ట చంద్రశేఖర్ రచనకు కెవి ప్రసాద్ దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి క్షేత్రం నాటికను ఆకురాతి శిల్ప రచనకు జీవి మనోహర్ దర్శకత్వం వహించారు. మూడవ ప్రదర్శనగా అజరామరం నాటికలను ప్రదర్శించారు. ఆద్యంతం సందేశాత్మకంగా నిలిచిన నాటకాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. నాటిక ప్రదర్శనలను ఆరాధ్యుల కన్నా, జి సుబ్బారావు, గోపరాజు విజయ్, లక్కరాజు లక్ష్మణ్ రావు, కొండపి శ్రీనివాసరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పర్యవేక్షించగా పలువురు కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో సేవారంగంలో ప్రముఖులుగా ఉన్న రెడ్ క్రాస్ ప్రతినిధి ముమ్మనేని భానుమతి, శ్రీశైల భక్త సేవా సమాజం నిర్వాహకులు కుర్రా శ్రీను ను సత్కరించారు.

కలర్స్ హెల్త్‌కేర్‌కు కమిషన్ వడ్డింపు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

సహజ సిద్దంగా బరువు తగ్గిస్తామని నమ్మించి, మెషినరీ వాడటం వల్ల ఇద్దరి అనారోగ్యానికి కారణమైన స్థానిక లక్ష్మీపురంలోని కలర్స్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ బాధితులకు రూ.1,37,745లు చెల్లించాలని జిల్లా వినియో గదారుల కమిషన్ ఆదేశించింది. స్థానిక విద్యా నగర్‌కు చెందిన భార్యభర్తలు యార్లగడ్డ నాగచైతన్య, యార్లగడ్డ అనుష లావు తగ్గటానికి కలర్స్ హెల్త్‌కేర్‌కు వెళ్లారు. వారు సహజ సిద్ధంగా లావు తగ్గిస్తామని చెప్పటంతో ఇరువురిమీద రూ.1 లక్ష రూపాయాలు చెల్లించారు. కానీ సహజ సిద్దంగా కాకుండా ఎలక్ట్రానిక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. అయితే వారికి నరాల నొప్పి సమస్య వచ్చింది. దీంతో వారు వేరొక డాక్టర్‌ను సంప్రదించగా ఆ చికిత్సను వెంటనే ఆపాలని సూచించారు. బాధితులు కలర్స్ హెల్త్‌కేర్ వారికి వద్దకు వెళ్లి ముందు చెప్పిన దానికి భిన్నంగా చికిత్స చేసినందున ఫీజు తిరిగి ఇవ్వాలని అడిగారు. అందుకు కలర్స్ హెల్త్‌కేర్ వారు అంగీకరించలేదు. దీంతో బాధితులు తమ న్యాయవాది ఎల్.వి.కుమార్ ద్వారా కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ వారు ఇరువురి వాదనలు విన్నమీదట కమిషనర్ అధ్యక్షురాలు టి.సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి తమ తీర్పులో పిటీషనర్లకు రూ.84,745లు, దానిపై 9శాతం వడ్డీ, రూ.50వేలు పరిహారం, రూ.3వేలు కోర్టు ఖర్చులు కలిపి రూ.1,37,745లు చెల్లించాలని కలర్స్ హెల్త్‌కేర్‌ను ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.

అభివృ ద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే ఆర్కే సమీక్ష

ప్రజాశక్తి మంగళగిరి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో మరల వైసీపీలోకి తిరిగి చేరారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కమిషనర్ వి నిర్మలా కుమార్, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు.

రైతు కమిటీ నాయకులకు పత్రాలు అందచేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

గ్రామాల్లో రైతులతో కలిసి పని చేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతులు పట్ల వైసిపి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, రాజధానికి భూములిచ్చిన రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి రఘురాం నగర్లోని టిడిపి ప్రజా వేదిక వద్ద మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ రైతు సమావేశంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన రైతు కమిటీకి పత్రాలు అందజేశారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమరావతి రైతులను, రాజధాని దృష్టిలో పెట్టుకొని రైతు సంఘం నేతలంతా సైకో జగన్‌ని ఇంటికి పంపేయాలని పిలుపునిచ్చారు. గ్రామ రైతులతో కలిసి కలిసికట్టుగా పని చేయాలని, రైతు సమస్యలను తెలుసుకోవాలని, ఎన్నికల్లో విజయవంతంగా రైతువిభాగం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ఎం.వీరారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు ఆర్.నాన్నయ్య, మండల అధ్యక్షులు బి.నరసింహారావు, పి.సాంబశివరావు, జె.జగన్ మోహన్ రావు, డి.భాస్కరరావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అరాచకంలో ముందు నిలిపారు : టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశంలో అభివృద్ధి లేని ఏకైక రాష్ట్రం, రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రఫీతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో ముందుకు పోతుంటే, మన రాష్ట్రం మాత్రం అరాచకంలో ముందుకు పోతోందన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభలో మీడియాపై దాడి జరిగినా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని విమర్శించారు. విలేకరిపై హత్యాయత్నం డిజిపికి కనిపించలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. టిడిపి తెచ్చిన 120 సంక్షేమ పథకాలు రద్దు చేసిన వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిధులను దారిమళ్లించిన జగన్‌పై యుద్ధానికి జనం సిద్ధంగా ఉన్నారని అన్నారు.

నర్సింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని వేద పారామెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం నర్సింగ్ విద్యార్థిని బొంత విన్నకి మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని మంగళవారం సహాయం అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్, గ్రామ అధ్యక్షుడు సురేష్, ఫౌండేషన్ నిర్వాహకులు ఎం.కృష్ణారావు, కె.కిరణ్, కె.ప్రసాద్ పాల్గొన్నారు.



ఆడపిల్లలు లేని సమాజం ప్రమాదకరం

ఈపూరులో మాట్లాడుతున్న డాక్టర్ డి.నాగేంద్రబాబు

ప్రజాశక్తి-ఈపూరు

సమాజ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం కీలకమని, ఈ కోణంలో బాలికలు ఉన్నతంగా ఎదిగేందుకు అందరూ తోడ్పాటు ఇవ్వాలని కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డి.నాగేంద్రబాబు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పీసీ పీఎన్డిటి చట్టంపై ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వైద్య బృందం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షలు నియంత్రణకు 1994లో ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టిందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి మూడేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. అబార్షన్ వల్ల మహిళకు కలిగే శారీరక నష్టాలను వివరించారు. ఆడపిల్ల పుట్టుకను భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, ఆడపిల్ల లేని సమాజం ప్రమాదకరమని అన్నారు. దేశంలో ఆడపిల్లలు తక్కువ శాతం ఉన్న రాష్ట్రాలలో వారు ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు. మాతాశిశు మరణాలు తగ్గించడంలో అంగన్వాడీలు, ఎఎన్ఎంల పాత్ర కీలకమని, పౌష్టికాహారం తీసుకోవటంపై అవగాహన పెంచాలని సూచించారు. బాల్యవివాహాలను అడ్డుకోవాలని, వాటి ద్వారా వచ్చే ఆరోగ్య, ఆర్థిక సమస్యలపై అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అరుణ, సర్పంచ్ పి.చెంచయ్య, వైద్యులు బి.నవీన్, పిహెచ్ఎన్ టి.లక్ష్మీనరసమ్మ, ఎంపీహెచ్ఈఓ వి.సాంబశివరావు, అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని సిడిపిఒ అనురాధ కోరారు. పట్టణంలోని కేజీబీవీలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాలికలు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాలు చేసినా, సహకరించిన శిక్షార్హులని చెప్పారు. ఫోక్సో చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు బాలికను పెళ్లి చేసుకున్న మేజర్ వరుడుకి 20 ఏళ్లు జైలు, 16-18 ఏళ్లలోపు మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటే పదేళ్ల జైలుశిక్ష పడుతుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు కె.శ్రీలత, శేషకుమారి, అంగన్వాడిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సిడిపిఒ టి.శ్రీలత అన్నారు. సత్తెనపల్లి మండలం రామకష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ వివక్షత, మానవ అక్రమ రవాణా, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలతో అనర్థాలపై వివరించారు. ప్రిన్సిపాల్ శైలజ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు జెడ్‌పి పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ సమానత్వం, మహిళలపట్ల వివక్షపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మున్ని వివరించారు. హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలపై అవగాహన సదస్సును మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు మౌనిక మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, అందుకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడతాయని చెప్పారు. భ్రూణ హత్యలు సరికాదని, అమ్మాయి అయినా, అబ్బాయి అయినా సమానంగా పెంచాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శివకుమార్, అంగన్వాడి సూపర్వైజర్ షేక్ పెద్ద ఇమాంబి, అంగన్వాడీలు, హెల్త్ సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం గురుకులంలో మాట్లాడుతున్న సిడిపిఒ శ్రీలత

పెదకూరపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమరావతిలో ప్రదర్శన

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన నేపథ్యంలో ఎంఇఒ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు నాయకులు సత్తెనపల్లి మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం గండ్లూరు అడ్డరోడ్ సమీపంలో స్కూల్ బస్సుకు పెను ప్రమాదం తప్పిందని అన్నారు. సోమవారం సాయంత్రం సత్తెనపల్లి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు విద్యార్థులతో వెళుతున్న ప్రవేట్ పాఠశాల స్కూల్ బస్ గండ్లూరు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకు వెళ్లిందని చెప్పారు. ఈ సందర్భంలో బస్సులో సుమారు 50 మంది విద్యార్థులున్నారని తెలిపారు. మండలంలోని ప్రవేట్ పాఠశాలల బస్సులు ఫిట్నెస్, బ్రేకింగ్ లేని బస్సులను సంబంధిత అధికారులతో సీజ్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అమూల్య, ఇక్లాస్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

టిడిపిలో మళ్లీ చేరనున్న మాజీ ఎంపిపి?

ప్రజాశక్తి-ఈపూరు

మాజీ ఎంపిపి బొల్లా వెంకట కోటయ్య వైసిపిని వీడనున్నారని, గురువారం టిడిపిలో చేరనున్నారని తెలిసింది. అంగలూరుకు చెందిన బొల్లా వెంకట కోటయ్య టిడిపి హయాంలో రెండుసార్లు సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా, అంగలూరు సొసైటీ చైర్మన్‌గా, ఈపూరు మండల పరిషత్ అధ్యక్షునిగా పదవులు చేపట్టారు. దశాబ్ద కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న వెంకట కోటయ్య 2019 ఎన్నికల్లో వైసిపి గెలుపుకు కృషి చేశారు. ఎన్నికల అనంతరం వైసిపికి దూరంగా ఉంటూ బొల్లా వెంకట కోటయ్య సత్యవతి ఫౌండేషన్‌ను స్థాపించి సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన్ను టిడిపి నాయకులు మంగళవారం కలిసి టిడిపి విజయం కోసం తోడ్పడాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో ఆర్.జగ్గారావు, రామకోటేశ్వరరావు, పి.సైదారావు, జి.వెంకయ్య, ఎ.కోటేశ్వరరావు, బి.రామయ్య, టి.బాలయ్య, ఎన్.రమణయ్య, ఎన్.కిషోర్ ఉన్నారు.

మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో గుర్తింపు పొందిన నాయకులకే రక్షణ లేకపోయిందని, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. శ్రీనివాసరెడ్డి వివాద రహితుడని, రాజకీయంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 21 ఫిబ్రవరి 2024

వాలంటీర్ల వ్యవస్థకు ప్రపంచ స్థాయిలో ప్రశంసలు

వాలంటీర్లకు వందనంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి తెనాలి

వాలంటీర్ వ్యవస్థ పొరుగు రాష్ట్రాలను ఆకర్షించడమే కాకుండా ప్రపంచ స్థాయిలో ప్రశంసలు అందుకుంటుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం 'వాలంటీర్ కు వందనం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల మాదిరిగా వాలంటీర్ వ్యవస్థ కూడా ఉంటుందని విష ప్రచారం చేశారని, దానికి భిన్నంగా, ప్రభుత్వ నమ్మకానికి దీటుగా వాలంటీర్లు పనిచేశారన్నారు. పట్టణంలో 928 మంది వాలంటీర్లు పనిచేస్తున్నారని, వారి పనితీరు ఆధారంగా 879 మందికి సేవ మిత్ర, 8 మందికి సేవ రత్న, మరో ఇరువురికి సేవా వజ్ర పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. వాలంటీర్ వ్యవస్థ పై జనసేన చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీలు చేసే విమర్శలను తప్పుడు ప్రచారాలను పట్టించుకోవద్దని వైసిపి పాలనకు అండగా నిలవాలని వాలంటీర్లను కోరారు. అనంతరం వాలంటీర్లను ప్రశంస పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, మాలేపాటి హరిప్రసాద్, మాజీ చైర్పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, కె జైపాల్, జి సాయి హరే రామ్, ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ ఎం ప్రభాకర్, పాల్గొన్నారు.

తెనాలి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేబ్రోలులో వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చేబ్రోలు: చేబ్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో 7గురు వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న సేవ వజ్రా పురస్కారాలు ఎమ్మెల్యే కిలారు రోశయ్య అంద జేశారు. కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండలంలో ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్ ఆశయ సాధనలో పని చేస్తున్నారని మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ సుపరిపాలనను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చారని అన్నారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు ఫ్రంట్ లైన్ వర్కర్స్ గా ముందుండి అందించిన సేవలు మరువలేవని అన్నారు. వాలంటీర్లు సేకరించిన డేటాతో మహిళ చోరీ అవుతానని మాట్లాడిన నాయకులు ఇప్పుడు నేను అలా అనలేదని మాట మార్చే పరిస్థితి వచ్చారని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్, ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి శ్రీనివాసరావు, పిఎసిఎస్ వేజెండ్ల చైర్మన్ చందు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తాడికొండ: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు వాలంటీర్లకు ప్రశంశాపత్రాలు అందజేశారు.

రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి

ప్రజాశక్తి-గుంటూరు

హెడ్‌వాటర్ వర్క్సును సందర్శించిన మేయర్, అధికారులు

గుంటూరు నగర ప్రజలకు మెరు గైన తాగునీటిని అందించే ందుకు ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకుంటు న్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం నగరానికి తాగు నీటి సరఫరా జరిగే ప్రధాన కేంద్రమైన తక్కెళ్ళపాడులోని హెడ్ వాటర్ వర్క్సని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత హెడ్‌వాటర్ వర్క్సులోని క్లియర్ వాటర్ సంప్, ఫిల్టర్‌బెడ్స్, ఏరియేటర్స్, ఆలం ట్యాంక్, క్లారిఫ్లోక్లేటర్స్, క్లోరిన్ మిక్సింగ్‌ప్లాంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ నగరంలోని బిఆర్ స్టేడియం, ఐపిడి కాలనీ, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, తారకరామనగర్, ఆటో నగర్, ఏటుకూరు రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన బుధవారం సాయంత్రానికి శుభ్రం చేయించాలని ఆదేశించారు. హెడ్ వాటర్‌వర్క్సులో కష్ణానది నుండి వస్తున్న నీటిని నిర్దేశిత విధానంలో శుభ్రం చేసేప్రక్రియను ఈ.ఈ నేరుగా ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలన్నారు. ఆలం, క్లోరిన్ అవసరానికి తగిన విధంగా స్టాక్ మైంటైన్ చేయాలన్నారు. నగరంలో త్రాగు నీటి సరఫరాపై ఎక్కడా పిర్యాదు రాకుడదని, పిర్యాదు వస్తే సంబంధిత ఎ.ఈ తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో క్లోరిన్ శాంపిల్స్ అనంతరమే ప్రజలకు సరఫరా జరగాలని, టైలెండ్ పాయింట్‌లలో కూడా ఏమినిటి సెక్రెటరీలు పరిశీలించాలన్నారు. పర్యటనలో ఎస్.ఈ సుందర్రామిరెడ్డి, ఈఈలు శ్రీనివాస్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌లకు నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిబంధనలు పాటించని మినరల్ వాటర్ ప్లాంట్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తిచేకూరి స్పష్టం చేశారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రజారోగ్య అధికారులు నగరంలోని శారదాకాలని, శ్రీనగర్, బొంగరాలబీడు, ఐపిడి కాలని, సంగడిగుంట, నల్లచెరువు మెయిన్ రోడ్డులోని 25 మినరల్ వాటర్ ప్లాంట్‌లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా, ప్రజారోగ్యానికి భంగం కల్గించేలా మినరల్ వాటర్ ప్లాంట్‌లు నిర్వహిస్తున్నారని రీజినల్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందన్నారు. ఇప్పటికే సోమవారం 6 ప్లాంట్‌లు సీజ్ చేశామన్నారు. ఆయా ప్లాంట్‌లో విక్రయిస్తున్న నీటిలో పిహెచ్ లెవల్స్ నిబంధనల మేరకు నిర్వహించడం లేదని, ప్రమాదకర క్లెబిసిల్లా బ్యాక్టీరియాని కూడా గుర్తించినట్లు ల్యాబ్ రిపోర్ట్ అందిందన్నారు. కావున ప్లాంట్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబందనలు పాటించాలని, లేకుంటే సీజ్ చేయక తప్పదని హెచ్చరించారు. ప్రజలు కూడా నిర్దేశిత ప్రమాణాలు లేని ప్లాంట్ ల నుండి నీటిని కొనుగోలు చేయవద్దని కమిషనర్ ప్రజల్ని కోరారు. వార్డు సచివాలయాల వారీగా నగరంలోని మినరల్ వాటర్ ప్లాంట్ లకు అనుమతులు, ల్యాబ్ రిపోర్ట్‌లపై ఇవ్వాలని నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, ఎస్ఎస్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు అంగడి వెంకటేశ్వర్లు, భవాని బాబు, ఐజాక్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మందులు అందజేస్తున్న శంకరరెడ్డి

300 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎపిఎస్ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌత్-1 డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టిటి యార్డులో 300 మంది ముఠా కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు నిర్వాహకులు బి.శంకరరెడ్డి మాట్లాడుతూ ఈ క్యాంపులో జనరల్ పరీక్షలు, షుగర్, బిపి, కంటి పరీక్షలు, ఇసిజి పరీక్షలు సంబంధిత డాక్టర్లు నిర్వహించారని చెప్పారు. కంటి సమస్యలు ఉన్న వారికి అవసరమైన కళ్లజోళ్లు త్వరలోనే అందిస్తామని చెప్పారు. ముఠా పని చేసే పేదలకు వైద్య సహాయం అందిచడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, సిబ్బందితో పాటు టిటి యార్డు మేస్త్రీ కె.శ్రీనివాసరావు, టి.వెంకటయ్య, ఎం.ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

పంటలను ఈకెవైసి చేయించాలి

అపరాలు పంటలను సందర్శించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మంగళవారం తెనాలిలో పర్యటించారు. ఈ క్రాప్ పూర్తయిన నేలపాడు, బుర్రిపాలెంలో పంటపొలాలను సందర్శించారు. ఆర్బికే సెంటర్ల ద్వారా ఈక్రాప్ చేయబడిన జొన్న, మొక్కజొన్న, పంట పొలాలను వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలమేరకు పంటల ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రబీలో ఈక్రాప్ చేసుకున్న అపరాలు పంటలను సందర్శించమన్నారు. రైతులు తప్పనిసరిగా తమపంటలను ఈకెవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆర్బికే, మీసేవ సెంటర్ల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పిఎం కిసాన్ లిస్టులో ఉండి ఆధార్ నంబరుకు లింకైనా బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అలాగే మీసేవ సెంటర్ ద్వారా ఈకెవైసీ ద్వారా ఎన్పిసిఐ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ప్రేమ్ సాగర్, కేహెచ్ వర్మ, పి దీప్తి, ఎంపిఒ లు పాల్గొన్నారు.

వెల్డింగ్ మిషన్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 7, 9, 11, 12, 14, 23 వార్డులకు చెందిన ఎం.గోపినాథ్, ఎస్‌కె షబీర్, వి.వెంకటనరసింహారావు, ఎండి రహమతుల్లా, అబ్దుల్ రహీం, నాగేశ్వరరావు, డి.బాలరాజులకు తాడేపల్లి టిడిపి పట్టణ కార్యాలయంలో మంగళవారం వెల్డింగ్ మిషన్లు అందజేశారు. తమకు వృత్తి పరికరాలు అందజేయాలని నారా లోకేష్‌కు అర్జీ పెట్టిన నేపథ్యంలో వారికి ఆసరాగా ఈ మిషన్లు అందజేసినట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పుల్లారెడ్డి, ఎ.చెన్నయ్య, ఎ.మురళీ, శ్రీనివాసరావు, బి.రవికుమార్, కె.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్లు అందజేస్తున్న వెంకట్రావు

సైబర్ నేరాలపై ప్రత్యేక చట్టాలు తేవాలి

సినిమాటోగ్రఫీ చట్టం ముసాయిదా బిల్లుపై 'మా-ఎపి' అభ్యంతరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాట్లాడుతున్న దిలీప్ రాజా

సినిమాటోగ్రఫీ చట్టం 1952 సవరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ముసాయిదా బిల్లుపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ 24 విభాగాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు మాఎపి వ్యవస్థాపకుడు, సిని దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. స్థానిక మా - ఎపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పలు సినిమా సంఘాలు తమ అభ్యర్థనను పరిశీలించి ముసాయిదా బిల్లును వ్యతిరేకించవలసిన అవసరం ఉందన్నారు. ఈ ముసాయిదా బిల్లు భావ ప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. ఫేస్ బుక్, యు ట్యూబ్, సోషల్ మీడియాల్లో ప్రసారం అవుతున్న అశ్లీల ప్రదర్శనలను వెంటనే నిలిపివేయాలని సెన్సార్ బోర్డ్ ను కోరారు. సైబర్ నేరాలపై ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెల్ ఫోన్లలో వస్తున్న నగ్నదశ్యాల ప్రదర్శనలు, వ్యంగ్య వ్యాఖ్యల నిర్మూలనకు కఠినమైన చట్టాలను తేవాలని ప్రభుత్వాన్ని కోరారు.

న్యాయ సేవాధికార సంస్థకు వాలంటీర్ల ఎంపిక

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ వాలంటీర్ల ఎంపిక మంగళవారం జరిగింది. ఏళ్ల తరబడి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసేందుకు లోక్ అదాలత్ లను ఏర్పాటు చేయడం ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందడంతో పాటు సమయం వృధా కాకుండా చూడటం కోసం స్వచ్ఛందంగా పనిచేసేందుకు ముందుకు వచ్చిన వారిని వాలంటీర్లుగా నియమించి కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ వాలంటీర్లుగా ఏడుగురు దరఖాస్తు చేసుకోగా ఐదుగురిని వర్చువల్ ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పార్థసారథి, సెక్రటరీ లీలావతి ఎంపిక చేశారు.

బిసిలకు ప్రాధాన్యమిచ్చిన టిడిపి

జయహో బిసిల సభలో వక్తలు

ప్రజాశక్తి మంగళగిరి :బీసీల సంక్షేమ కోసం ఏర్పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని రాష్ట్ర టిడిపి బీసీ సెల్ నాయకులు డి సుందర్రావు యాదవ్ అన్నారు. టిడిపి, జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ, గ్రామాల జయహో బీసీ సభ మంగళగిరి పట్టణంలోని ఈద్గా హాల్లో నాయకులు కే అంకమ్మరావు అధ్యక్షతన నిర్వహించారు. సుందర్ రావు యాదవ్ మాట్లాడుతూ ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీ కులాలకు రాజకీయ అధికారం లభించిందని అన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి పాలనలో పాలనలో బీసీలపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసి కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన పార్టీలను గెలిపించు కోవడానికి బిసి కార్యకర్తలు సైనికుల్లాగా పని చేయాలని పిలుపునిచ్చారు. సభలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, దామర్ల రాజు, జి ధనుంజయరావు, వాకా మాధవరావు, ఏ భూలక్ష్మి, జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతి రావు, జె సాంబశివరావు ప్రసంగించారు.

నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం చేసిందేమీ లేదు : ఆలపాటి

ప్రజాశక్తి తెనాలి: వైసీపీ ప్రభుత్వంలో నాయి బ్రాహ్మణ సంఘాలకు ఏమాత్రం మేలు జరగలేదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. స్థానిక మారీసుపేట లో మంగళవారం జరిగిన నాయి బ్రాహ్మణ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలపాటి మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు వృత్తి పరంగా, వ్యక్తిగతంగా లోన్లు ఇచ్చి ప్రోత్సహించి సమాజంలో వారికంటూ గుర్తింపునిచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుం దన్నారు. కానీ వైసిపి ప్రభుత్వంలో రూపాయి ఇచ్చి వంద వారి దగ్గర వసూలు చేస్తూ వారి జీవితాల్లో అంధకారాన్ని నింపారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికలలో వైసిపికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘ నేతలు కె సుబ్రహ్మణ్యం, సిహెచ్ సూర్యమోహన్, జి రాజా రమేష్, ఐ శివలింగ ప్రసాద్, ఎం గంగాధర్ పాల్గొన్నారు.

నేడు జెకెసిలో తెలుగు లిపి మార్పులపై పోస్టర్స్ ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 21వ తేదీన స్థానిక జెకెసి కాలేజిలో తెలుగు లిపి మార్పులను సూచిస్తున్న గోడ ప్రతుల ప్రదర్శన కార్యక్రమాన్ని తెలుగు, ప్రాచ్యభాషా విభాగం, గ్రంథాలయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలుగు విభాగం అధ్యాపకురాలు యలవర్తి ప్రశాంతి, గ్రంధాలయ శాఖ సిహెచ్ నాగభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భాషకు శాశ్వత రూపాన్ని కల్పించేది లిపి. ఇది విజ్ఞాన సాధనానికి మూలం. అయితే నేడు తెలుగు లిపిలో కొన్ని అక్షరాలు రూపం మార్చుకుంటున్నాయి. కొన్ని అక్షరాలు పూర్తిగా కనుమరుగైపోయాయి. లిపి సంస్కరణలకు నేటి ఆధునిక కాలం అడుగు వేయవలసిన పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికే తెలుగు దినపత్రికలు కూడా ఈ మార్పుని గ్రహించాయి. తెలుగు లిపిలోని కొత్త ప్రయోగాలని గమనించి దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నాయి. మాతభాష- లిపుల పట్ల విద్యార్థులకు అవగాహన పెంపొందించడం కోసం జెకెసిలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

నవజాత శిశుమరణాల తగ్గింపునకు కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కృషి చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం అమరావతి రోడ్డు లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నవ జాతా శిశు సంరక్షణ అవసరం అంశం పై జరిగిన సింపోజియంలో ఆయన మాట్లాడారు. నవ జాతా శిశువుల సంరక్షణ బాధ్యత అందరి పై ఉందని అన్నారు. నవ జత శిశువుల జననానికి ముహుర్తాలు నిర్ణయించి ఆపరేషన్లు చేయాలని తల్లితండ్రులు కోరుకోవడం బాధాకరమని అయన అన్నారు. విద్యావంతులు కూడా అవగాహనా లేకుండా వ్యవహరిస్తున్నారని అయన విచారం వ్యక్తం చేశారు. నవజాత శిశువు మరణాలను తగ్గించాలని ఆయన సూచించారు. ఆధునిక వైద్యాన్ని అభ్యసించి వైద్యులు ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని అయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డి యం హెచ్ ఓ డాక్టర్ కె విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా రమణ శ్రీ , శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

బైజూస్ టాప్‌లు తప్పనిసరిగా ఉపయోగించాలి : ఆర్‌జెడి

పాఠశాలలను సందర్శించిన విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి

పాఠశాల విద్య ఆర్‌జెడి బి.లింగేశ్వరరెడ్డి స్థానిక పాతబస్టాండ్ వద్ద గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఐఎఫ్‌పి ప్యానల్స్ తప్పనిసరిగా ఉపయోగించి బోధన చేయాలని సూచించారు. అదే విధంగా బైజూస్ టాప్స్ విద్యార్థులందరూ వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆరో తరగతి నుండి టోఫెల్ తప్పనిసరిగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎవిఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ స్థానిక రైలుపేటలోని గొలుసు కొండలరావు నాంచారమ్మ మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు. ఉపాధ్యాయులు కొత్త బోధనా పద్ధతుల్ని నేర్చుకొని తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం ఎస్‌జిఎన్‌కె పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థులకు టోఫెల్ బోధనకు సంబంధించి ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవాలన్నారు.

న్యాయసేవాధికార సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

మాట్లాడుతున్న పివి రాంబాబు

క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా మంగళవారం గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ పౌరులందరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ శాఖలు తమ శాఖాపరమైన ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని తెలియచేశారు. ఈ సందర్భంగా పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు మాట్లాడుతూ కక్షిదరులందరూ లోక్‌అదాలత్ సేవలను వినియోగించుకోవాలని తెలియచేశారు. ఈ సందర్భంగా ప్రపంచ సామాజిక న్యాయదినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ముఖ్య ఉద్దేశం పేదలకు, బలహీనవర్గాలకు సమన్యాయం కలిగి ఉండాలని ప్రభుత్వం అందించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వ శాఖలు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు, జిల్లా ప్రొబేషన్ అధికారి బి.ఎ.సత్యనారాయణ, కలెక్టర్ ఆఫీసు సూపరింటెండెంట్ యం.లక్ష్మయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కులపై చలపతి ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

ఓటు హక్కుపై మాట్లాడుతున్న విద్యార్థినులు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ వారి సహకారంతో చలపతి ఫార్మసీ కాలేజిలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం-1 వారు నిర్వహిస్తున్న వారం రోజుల స్పెషల్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళవారం ఓటు హక్కు వినియోగంపై లాం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించటం చాలా ముఖ్యమని, ప్రజ లకు తమ ప్రభుత్వంపై అభిప్రాయం చెప్పుకోవటానికి, ప్రజల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల్ని ఎన్నుకోవటానికి ఓటు ఒక్కటే మార్గం అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని విద్యార్థులు అవగాహన కల్పించారు.

విజ్ఞాన కేంద్రంలో కుట్టు శిక్షణ ప్రారంభం

'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ఉత్తరఅమెరికా తెలుగు సంఘం నాట్స్ సహకారంతో తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పెదనందిపాడులో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, గుంటూరు జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, పిఎఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవ య్యలు ప్రారంభించారు. అనంతరం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పల పూడి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో లక్ష్మణరావు ప్రసంగించారు. విజ్ఞాన కేంద్రంలో మహిళలకు కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు శిక్షణను ఇవ్వడం వంటి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే బహుముఖ కార్యక్రమాల రూపకల్పన జరుగు తుందని తెలిపారు. మాజీ ఎంపీపీ ముద్దన నగరాజు కుమారి మాట్లాడుతూ మహిళలు తమ స్వశక్తి మీద ఎదగాలని, కుటుంబ పోషణకు తమ వంతు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి ఇటువంటి కార్యక్రమా లను ఉపయోగ పెట్టుకోవాలని, విజ్ఞాన కేంద్రం నిర్వహణలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గుంటూరు జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ చైర్మన్ పాశం రామారావు మాట్లాడుతూ తాము జిల్లాలో అనేక చోట్ల విజ్ఞాన కేంద్రాలు నిర్మించి పేదలకు, దళితులకు, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని మాజీ ఎంపీపీ ముద్దన నగరాజుకుమారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జంపని రామారావు, కో కన్వీనర్ కొత్త వెంకటశివరావు, సభ్యులు చుక్కా యానాదులు, కాపు వెంకట సుబ్బారావు, కుట్టు శిక్షణ ట్రైనింగ్ టీచర్ ఎన్ భారతి, ఉపాధ్యాయ సంఘం నాయకురాలు మక్కెన జవహర్ రాణి, రైతు సంఘం నాయకులు బండి శంకరయ్య, నరిశెట్టి ఆచారి, గారపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు తదితరులు

ఎమినిటీ కార్యదర్శులకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలు

ప్రజాశక్తి-గుంటూరు

నగర ప్రజలకు మెరుగైన సత్వర సేవలు అందించేందుకు ఎమినిటి కార్యదర్శులకు పూర్తి స్థాయి భాద్యతలు కేటాయించినట్లు నగర కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగవాళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెరుగైన తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల్లో పారదర్శక పర్యవేక్షణకు, తాగునీటి సరఫరా విభాగంలోని కిందస్థాయి సిబ్బంది భాద్యతారాహిత్యం నివారణకు, అవినీతి నియంత్రణకు ఎమినిటి కార్యదర్శులకు ప్రత్యేకంగా పూర్తి స్థాయి భాధ్యతలు కేటాయిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరంలో తాగునీటి పైప్‌లైన్‌లపై లీకులు, వాల్‌పిట్స్ నిర్వహణ లోపాలను, అనధికార కుళాయిలు వంటి అంశాలు ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో వెలుగులోకి వచ్చాయని, భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయి పర్యవేక్షణకు వార్డు సచివాలయ ఎమినిటి కార్యదర్శులకు భాధ్యతలు కేటాయిస్తున్నామని తెలిపారు. సచివాలయం పరిధిలో జరిగే అభివృద్ధి పనులు, రిపోర్టింగ్‌ల ఎం.బుక్ రికార్డింగ్, ప్రతి పనికి ఎం-బుక్‌లో చెక్ మెజర్‌మెంట్ చేస్తారని, నాణ్యత పరీక్షలను నిర్వహించడం, రోడ్లపై గుంతల గుర్తింపు, మరమ్మతులు, అంచనా ప్రతిపాదనల తయారీ వంటి రోడ్ల నిర్వహణ పనులు, తాగునీటి సరఫరా సమయాలో (ఉదయం, సాయంత్రం) క్లోరిన్ శ్యాంపిల్స్, సంబంధిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై పర్యవేక్షణ, పైప్‌లైన్ లీకేజీల గుర్తింపు, స్కౌర్ వాల్వ్‌లు, లీకేజీల కోసం వాల్వ్ పిట్‌ల పరిశీలన, ఓపెన్ డ్రెయిన్లు ఉన్న ప్రాంతాలను తనిఖీ చేయడం, సరిదిద్దడానికి శానిటేషన్ సెక్రటరీకి తెలియజేయడం, హౌసింగ్, నాడు-నేడు, తాగునీటి పైప్ లైన్ లీకేజీ మరమ్మతులు, వీధి దీపాల మరమ్మతు పనులతో సహా సివిల్ పనుల నిర్వహణకు హాజరవటం, వాటర్ ట్రీట్మెంట్ కేంద్రాలు, పంప్ హౌస్‌లు, సర్వీస్ రిజర్వాయర్ల తనిఖీ, నీటి సరఫరా తక్కువ జరిగే శివారు ప్రాంతాల పరిశీలన తదితర ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నమోదు చేస్తారన్నారు. ప్రజల నుండి కొత్త నీటి కుళాయి కనెక్షన్, యుజిడి కనెక్షన్ దరఖాస్తుల స్వీకరణ. వ్యక్తిగత మరుగుదొడ్ల గుర్తింపు/ఆంక్షలు/అమలు కోసం ప్రాసెసింగ్ వంటి ఇంజినీరింగ్ విభాగ విధులు అంకిత భావంతో చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఎమినిటి కార్యదర్శులకు మంగళవారం నుండే విధుల కేటాయించాలని ఎస్.ఈ.ని, వారి పనిని పర్యవేక్షణ చేయాలని ఏఈలు, డిఈఈలను ఆదేశించారు.

స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

జిల్లాలో పేదలందరికీ ఇళ్ళు పథకం స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, ఓటరు ధరఖాస్తుల పరిష్కారంపై ఈఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, సచివాలయ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిఎంసి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని, వేగవంతం అయ్యేలా సచివాలయ నోడల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని నగర అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీలలోనూ వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న స్థలాల హద్దుల మ్యాపింగ్‌ను సర్వే, టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు. తప్పుల సవరణకు సంబంధించి వివరాలను నిర్దేశించిన మాడ్యూల్‌లో అప్లోడ్ చేసి వెంటనే సరిచేసి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఫిబ్రవరి 23వ తేదిన ప్రారంభిస్తున్నందున గ్రామీణ ప్రాంతాలలో బుధవారం నాటికి, పట్టణ ప్రాంతాల్లో గురువారం నాటికి రిజిస్ట్రేషన్లు ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అలసత్వం వహించే సచివాలయ ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారు లపై కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాలో ఓటరుకు సంబంధించి అన్ని ధరఖాస్తులను సక్రమంగా వెరిఫికేషన్ చేసి పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించేలా ఈఆర్వోలు నిరంతం పర్య వేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.